క్లుప్తంగా

గుంతలు పరిశీలించిన డీవైఎస్‌ఈ


గుంతను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఈ శ్రీధర్

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి కాలనీల్లోని పలుచోట్ల కల్వర్టులపై గుంతలు ఏర్పడగా సోమవారం 'సాక్షి' దిన పత్రికలో వెలువడిన 'రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు' అనే వార్త కథనానికి సింగరేణి అధికారులు స్పందించారు. సింగరేణి మందమర్రి ఏరియా డీవైఎస్‌ఈ శ్రీధర్ రెండో జోన్‌లోని రైల్వేస్టేషన్ రోడ్డులో గల ప్రభుత్వ పాఠశాల ముందు కల్వర్టుపై ఏర్పడిన గుంతతో పాటు భగత్ సింగ్ లైన్‌లో ఏర్పడిన గుంతను పరిశీలించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ కల్వర్టులు శిథిలావస్థకు చేరాయని, వాహనదారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. త్వరలో కొత్త కల్వర్టుల నిర్మాణానికి జీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

'సింగరేణి స్థలాన్ని కబ్జా చేయలేదు'

బెల్లంపల్లి: మండలంలోని బుధాకలాన్ శివారులో ఓల్డేజ్ హోం కోసం సింగరేణి కంపెనీకి చెందిన స్థలాన్ని తాము ఆక్రమించలేదని ప్రతిపాదిత వాసవి ఓల్డ్ ఏజ్ హోం ట్రస్ట్ నిర్వాహకుడు మంచాల రత్నాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారు సర్వే నంబర్ 149లో ఉన్న 20గుంటల భూమిని గుజ్జ రవికుమార్ అనే ప్రైవేట్ వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేశామని తెలిపారు. ఆ భూమి వద్దకు గత నెల 30న సింగరేణి అధికారులు వచ్చి తాము పాతిన ఓల్డ్ ఏజ్ హోం బోర్డును ధ్వంసం చేసి తొలగించారని పేర్కొన్నారు. తాము సింగరేణి కంపెనీకి చెందిన భూమిని ఆక్రమించుకున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. భూమి కొనుగోలుకు సంబంధించిన ఒర్జినల్ డాక్యుమెంట్స్ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. తాము కొనుగోలు చేసిన భూమి సర్వే నంబర్ 172లో ఉందని, ఆ స్థలం కంపెనీదని సింగరేణి ఎస్టేట్ అధికారులు చెబుతున్న దాంట్లో నిజం లేదన్నారు.

నిష్పక్షపాతంగా ఖాళీలు భర్తీ చేయాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఖాళీలను నిష్పక్షపాతంగా భర్తీ చేయాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ పోస్టుల భర్తీకి చేపట్టిన ప్రక్రియలో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. సీనియారిటీ ప్రాతిపదికనా భర్తీ చేయాలన్నారు. అర్హులైన వారికి మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. ప్రమాదాల్లో గాయపడి సర్ఫేస్ కోసం ఎదురు చూస్తున్న వారికి కేవలం 10శాతం వెయిటేజీ మాత్రమే ఇవ్వడం అన్యాయమన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో సీనియారిటీ, యాక్టింగ్‌లు, యాక్సిడెంట్ రిపోర్టులను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అప్పుడే నిష్పక్షపాతంగా ఫైనల్ సెలక్ట్ లిస్టును తయారు చేసి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సంఘ సమావేశంలో పాల్గొన్న చైర్మన్

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం నిర్వహించిన 16వ ఆర్థిక సంఘ సమావేశంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో పాల్గొని మంచిర్యాల మున్సిపాలిటీకి అవసరమైన నిధులపై చర్చించినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం 8.56కోట్లు రాగా, 16వ ఆర్థిక సంఘం ద్వారా వరదలు వచ్చినప్పుడు గోదావరి పొంగుతుందని వరద నివారణ చర్యలు, తాగునీటి సమస్యను తీర్చి, పచ్చదనం కోసం పార్కుల అభివృద్ధి, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, డంపింగ్ యార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

బెల్లంపల్లి: కరాటే పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటి పతకాలు గెలుచుకోవడం అభినందనీయమని సీఓఈ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీధర్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బెల్లంపల్లిలో ఆదివారం జరిగిన ఫస్ట్ స్టేట్ లెవల్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో సీఓఈ విద్యార్థులు ఆర్.శ్యామ్, ఎస్.ఆకాష్, డి.విశాల్ ద్వితీయ బహుమతి, బి.అక్షయ్‌కుమార్, ఎ.విశ్వ తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లోనూ రాణించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ ఎ.వామన్, కరాటే మాస్టర్ బోగ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి

- నివాళులర్పించిన ఉపాధ్యాయులు, నాయకులు ,విద్యార్థులు


బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీఓఈ ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్/జైపూర్/వేమనపల్లి/మందమర్రిరూరల్/దండేపల్లి/బెల్లంపల్లి/కాసిపేట: జిల్లా వ్యాప్తంగా కాళోజీ నారాయణరావు జయంతి, తెలుగు బాషా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు బాషకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, బాషను బ్రతికించుకోవడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. ఈ విషయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఎంతో బాధ్యత ఉందన్నారు. బాషయొక్క మూలాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాళోజీ నారాయణరావు జీవిత విశేషాలు, సాహిత్య, సాంస్కృతిక నడవడిక గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో జైపూర్‌లో ఆర్ఐ తిరుపతి, వేమనపల్లి మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ రమేష్, పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సుజాత, జిల్లా కేంద్రంలో వైస్ ప్రిన్సిపాల్ పత్తి సునీత, తెలుగు విభాగ అధిపతులు సరిత, రజిత, ఉపాధ్యాయులు సంగీత, కరీమా, సాగర్, కవి అల్లాడి శ్రీనివాస్, మందమర్రిలో ఉపాధ్యాయులు జగన్మోహర్‌రావు, మాధవి, కాసిపేటలో ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకుడు బాపు, దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు లచ్చన్న, అమ్జద్‌పాషా, రాజేష్, ప్రజ్ఞకుమారి, రజిత, సులోచన, బెల్లంపల్లిలో సీఓఈ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, ఉపాధ్యాయులు ఎం.మహేష్, ఎస్.విజయ్‌కుమార్, రత్నాకర్, వేణుగోపాల్, ఎ.వా మన్, రాజేశం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సోమయ్య, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జైపూర్: నివాళులర్పిస్తున్న తహసీల్దార్, అధికారులు


తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో...


దేవాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో...


మందమర్రిలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు


వేమనపల్లి: నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రతి పల్లెనూ ప్రగతిపథంలో నడిపిస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


నెన్నెలలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజల సమస్యలను తీర్చి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు సిద్ధంగా ఉన్నారని బెల్లంపల్లి నియోజకవర్గంలోని ప్రతి పల్లెనూ ప్రగతిపథంలో నడిపించేందుకు సిద్ధంగా ఉన్నానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలో 33మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులు, 22మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేసి మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గం వెనుకబడి ఉందని, ఇక్కడి ప్రజలు చాలా కష్టాల్లో ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మన నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే ఆలోచన చేస్తున్నారని వివరించారు. అధికారులు, నాయకులు సమన్వయంతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నెన్నెల మండలానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని, సాగునీరు, తాగునీరు, రోడ్డు, రవాణా సౌకర్యాలకు మొదట ప్రాధాన్యం ఇచ్చి, అంచెలంచెలుగా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రూ.2లక్షల రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందవద్దని వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ రమేశ్, నెన్నెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గట్టు మల్లేశ్, గొల్లపల్లి ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నెన్నెల మాజీ సర్పంచ్ తోట సుజాత, నాయకులు చీర్ల కిషన్‌రెడ్డి, తోట శ్రీనివాస్, జలిల్, మొహిద్ ఖాన్, కామెర శ్రీను, గట్టు బానేష్ పాల్గొన్నారు.

భీమిని, కన్నెపల్లి మండలాల్లో...

భీమిని: కన్నెపల్లికి చెందిన 11మంది అర్హులకు, భీమినికి చెందిన 30మందికి సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. 10మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై స్థానికులు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో గంగామోహన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాదవరపు నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం


అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాతమంచిర్యాల: అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో గర్మిళ్ల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం మాట్లాడుతూ.. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి, అక్షరాస్యత కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్, కార్యదర్శి చంద్రమౌళి, సభ్యులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జ్వర బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్


జ్వర బాధితులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రజలు జ్వరాల బారిన పడితే వెంటనే వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారికి వచ్చిన వ్యాధి ఏంటో నిర్ధారణ చేసి, చికిత్స అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, నస్పూర్, క్యాతనపల్లి, మంచిర్యాల మున్సిపాలిటీల్లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సోమవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, వాటిని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగేందుకు 72వైద్య బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి బృందంలో స్టాఫ్ నర్సు, ఆరోగ్య కార్యకర్త పాల్గొంటారని, ఒక పర్యవేక్షకుడిని నియమించామన్నారు. ఈ బృందం 50నుంచి 100ఇళ్లను ప్రతి రోజు వెళ్లి, వారి వివరాలను సేకరించి, జ్వరం, ఇంకేమైన లక్షణాలు ఉంటే పరీక్ష చేయడం, ఆర్డీ కిట్ల ద్వారా పరీక్షించి, మందులు అందించనున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అనిత, డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ అనిల్, డాక్టర్ శివప్రతాప్, నాందేవ్, అల్లాడి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి పో చయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు స్థానిక మహిళలై ఉండి 18సంవత్సరాల నుంచి 45సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. పదో తరగతి చదువుకుని తహసీల్దార్‌తో జారీ చేయబడిన ధ్రువపత్రాలను జతపరుస్తూ, ఈ నెల 13లోగా మండల విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జైపూర్ కేజీబీవీలో...

జైపూర్: మండల కేంద్రంలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయం ఖాళీగా ఉన్న హెడ్‌కుక్ పోస్టు భర్తీకి స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి, స్థానికంగా నివాస ధ్రువీకరణ పత్రాలతో 18–45ఏళ్ల వయస్సు గల మహిళలు స్థానిక ఎమ్మార్సీ కారాలయంలో దరఖాస్తు పత్రాలను అందించాలని తెలిపారు.

సహాయం మంజూరుకు స్వచ్ఛంద సంస్థల నుంచి...

మంచిర్యాలటౌన్: దీనదయాల్ వికలాంగ పునరావాస పథకం, సమీకృత వృద్ధుల సంక్షేమ పథకాల్లో భాగంగా బాధితులకు పునరావాసం కల్పించు కేంద్రాల్లో మరింత మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వేతర సంస్థలు(ఎన్జీవో) ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఆధార పత్రాలతో ఈ నెల 16లోపు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను నింపి, కార్యాలయానికి చేరుకునేలా పోస్టు ద్వారా కూడా పంపించవచ్చునని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపకార వేతనాలకు...

మంచిర్యాలటౌన్: దివ్యాంగ విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాలకు 2024–25కు గాను దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నూతన ఉపకార వేతనాలు, రెన్యువల్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాల కోసం డిగ్రీ, పీజీ/డిప్లొమా చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకుని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములను రక్షించండి..!

- కబ్జాలకు గురవుతున్నాయని ఆరోపణ
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూముల వివరాలివ్వాలి
- 'ప్రజావాణి'లో ప్రభుత్వ భూముల, చెరువుల పరిరక్షణ కమిటీ డిమాండ్
- భీమారంలో ఒకటి, వేమనపల్లిలో దరఖాస్తులు నిల్


భీమారంలో వినతిపత్రం ఇస్తున్న యువకులు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: మండలంలోని చెరువులు, కుంటలు, మత్తడి చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల వివరాలను ఇచ్చి ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి జన్నారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జన్నారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూముల, చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో భూముల వివరాలు సేకరించి, వాటి పరిరక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు అన్ని చెరువుల హద్దులు, ప్రభుత్వ భూములను గుర్తించి వారి ఆధీనంలో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ భూముల, చెరువుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కమ్మల విజయధర్మా, ప్రధాన కార్యదర్శి ప్రభంజన్, నాయకులు విజయ్, సత్యం, తిరుపతి, మహేశ్, సాయికుమార్ పాల్గొన్నారు.

భీమారంలో...

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఇందులో గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్ ఏర్పాటు చేయాలని స్థానిక యువకులు ఎంపీవో సతీష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శోభాయాత్ర సందర్భంగా రాత్రి వేళ లైటింగ్ కూడా ఉండేలా చూడాలని కోరారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో అర్జీలు రాలే..

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజావాణిలో ఎలాంటి అర్జీలు రాలేదు. తహసీల్దార్ రమేశ్, పశువైద్యాధికారి పవన్‌కుమార్, ఏపీవో సత్యప్రసాద్, ఐకేపీ సీసీ శ్రీధర్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమారం ఊర చెరువు సర్వే


ఊర చెరువు వద్ద సర్వే చేస్తున్న అధికారుల బృందం

భీమారం: మండల కేంద్రంలోని ఊరచెరువు హద్దుల ఏర్పాటుకు తహసీల్దార్ సదానందం నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం సర్వే నిర్వహించింది. చెరువు ఆక్రమణకు గురవుతోందని గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సర్వే చేపట్టారు. 14.39ఎకరాల శిఖం భూమిలో సర్వే నిర్వహించి ఇరిగేషన్ అధికారులకు అప్పగించనున్నారు. గతంలో కలెక్టర్ భారతిహోళ్లికేరి ఉన్న సమయంలో సర్వే చేసి హద్దులు గుర్తించినా హద్దురాళ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో పూర్తి స్థాయి సర్వే జరిపి శిఖం విస్తీర్ణంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో వచ్చే భూమిని గుర్తించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ డీఈ శారద, ఎస్సై రాములు, ఆర్ఐ స్రవంతి, సర్వేయర్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి


వినాయకుడి వద్ద సీపీ శ్రీనివాస్, సంస్థ చైర్మన్ శ్రీధర్

మంచిర్యాలటౌన్: ప్రజలందరూ ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలోనే పండుగలు, పూజలు నిర్వహించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో అంజనీపుత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని సోమవారం సీపీ దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. రియల్ ఎస్టేట్ సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు గణేషుని ఆశీస్సులు కలగాలని, ఈ ఏడాది 14అడుగుల విగ్రహం ఏర్పాటు చేశామని, లక్కీ డ్రా ద్వారా 111కిలోల ఉచిత లడ్డు వితరణ, నిత్యాన్నదానం వంటివి భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐలు బన్సీలాల్, అశోక్, అంజనీపుత్ర ఎండీ పిల్లి రవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, సదానందం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారి పౌష్టికాహారం తీసుకోవాలి

మంచిర్యాలటౌన్: ప్రతి చిన్నారి వయస్సుకు తగినట్లుగా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉంటారని, ఆరోగ్యంగా ఎదుగుతారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్కలవాడ 2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసంను పురస్కరించుకొని సోమవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట గ్రామపంచాయతీని సోమవారం మండల ప్రత్యేక అధికారి, డీటీడీవో మడావి గంగారాం సందర్శించారు. పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు, ఈగలు ప్రబలి ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందునా, ఫాగింగ్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఇన్‌చార్జి డీఎల్‌పీవో షేక్ సబ్దర్‌ఆలీ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నిర్వాహకులు అందుబాటులో ఉండాలి

బెల్లంపల్లిరూరల్(తాండూర్)/కాసిపేట: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఐకమత్యంతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. వినాయక మండపాలను సోమవారం వారు తనిఖీ చేసి, నిర్వాహకులకు సూచనలు చేశారు. కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు రేడియం బెల్టులు

చెన్నూర్: మున్సిపాలిటీ ప్రధాన రహదారుల్లో రాత్రి వేళల్లో సంచరించే పశువుల కారణంగా అయ్యే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చెన్నూర్ సీఐ రవీందర్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పశువులకు రేడియంతో తయారు చేసిన బెల్టులను పశువులు, గేదెల మెడలో భిగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణే లక్ష్యంగా రేడియం బెల్ట్‌లు తయారు చేయించినట్లు తెలిపారు.

నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి

మంచిర్యాలటౌన్: ఈ నెల 10వ తేదీన ఉదయం 10:30గంటలకు నస్పూర్‌లోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో అధికారులు, సంఘ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేవాలాల్ సేనా ఆవిర్భావ దినోత్సవం

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో సేవాలాల్ సేనా ఆవిర్భావ దినోత్సవాన్ని సేవాలాల్ సేనా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సేవాలాల్ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ మల్లేశ్ నాయక్ ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దరావత్ శంకర్ నాయక్, మండల అధ్యక్షుడు మోతీలాల్, బుక్యా లక్ష్మణ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నాయకులతో సమావేశం నిర్వహించి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం 6వ ఆవిర్భావ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా నాయకులు జయరావు, నాగమళ్ల ప్రకాష్, ఐలయ్య , సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తిరుమలగిరి కాలనీకి చెందిన మూగల వినయ్‌కృష్ణ ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ నెల 8న ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన మేనమామ బత్తిని రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసగా మారి ఆత్మహత్య చేసుకున్నాడంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫొటోగ్రాఫర్‌గా పని చేసే వినయ్ బయట ప్రాంతాల్లో ఫొటోషూట్ చేయించుకున్న వాళ్లు డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పుల పాలయ్యాడని పేర్కొన్నారు.

రేపు నిరసన

మందమర్రిరూరల్: ఎస్సీ వర్గీకరణ తీర్పును సుప్రీంకోర్టు పునః సమీక్షించాలని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.